నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మహబూబ్‌నగర్
గురువారం | మే 30, 2024 | www.navatelangana.com

తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు : ఏడీఏ



అమరచింత : అమరచింత మండలంలోని వ్యవసాయ ఎరువుల దుకాణాలను బుధవారం ఏడఏ. దామోదర్ తనిఖీ చేశారు. మండలంలోని నందీశ్వర ట్రేడర్స్, శ్రీ సాయి సావిత్రి ట్రేడర్స్, హనుమాన్ ట్రేడర్స్ దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, రసీదులను దామోదర్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాగా శ్రీ సాయి సావిత్రి ట్రేడర్స్ దుకాణంలో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ నందు వివరాలు సరిగా లేనందున 1,08,680 రూపాయల పత్తి విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే హనుమాన్ థియేటర్స్ నందు సరియైన రసీదు లేనందున రూ.30,000ల మిరప విత్తనాలు అమ్మకం నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణదారులు రైతులకు కొనుగోలు సమయంలో తప్పక బిల్లులను ఇవ్వాలని ఆదేశించారు. రైతులందరూ ప్రభుత్వ లైసెన్సు కలిగిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్

నవతెలంగాణ - తిమ్మాజిపేట

విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం అవంచ రాళ్లచెరువు తండా బాజీపూర్ మారేపల్లి కోడుపర్తి అప్పజిపల్లి ఇప్పలపల్లి గ్రామాలలో విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో కల్తీ లేని విత్తనాలను కొనాలని, విత్తనాలు విత్తన కాల పరిమితిని తప్పనిసరిగా సరిచూసుకోవాలని తెలిపారు. అలాగే కంపెనీ పేరు లాట్ నెంబర్ ఎక్కడి నుంచి వచ్చింది అనే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తప్పనిసరిగా బిల్లును తీసుకోవాలి అలాగే విత్తన ప్యాకెట్లను చివరి వరకు రైతు వద్దనే పెట్టుకోవాలని ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆ బిల్లు ఆ కవర్లు ఆధారమని రైతులకుఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిరాం, శివసాగర్ ,అబ్దుల్లా నవాజ్, శేఖర్, సంతోష, సాయిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

జిల్లాలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూజిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి కోరారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మే 30 1970లో బెంగాల్ రాష్ట్ర రాజధాని అయిన కలకత్తాలో సీఐటీయూ ఏర్పడిందని తెలిపారు. సీఐటీయూ ఏర్పడిన నాలుగు సంవత్సరాల కాలంలోనే 1974లో రైల్వే సమ్మెను అన్ని కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి 24 రోజుల రైల్వే సమ్మె జరిగిందని. ఇందులో సీఐటీయూ క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 26 సార్వత్రిక సమ్మెను నిర్వహించి పాలకవర్గాలను నిలేసి కార్మిక హక్కులను కాపాడుకుందని, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిందన్నారు. అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టం కోసం పోరాడుతుందని. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, దినసరి, ఫిక్స్డ టర్మ్ పేరుతో కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీ చేస్తున్న పాలకవర్గాలు, కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా రాజులేని పోరాటాలు నిర్వహించిందన్నారు .ఈ క్రమంలో భారతదేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపైన, ఎనిమిది గంటల పనిని 12 గంటలకు పెంచిందని, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్య పరచడము,కార్పొరేట్లకు ఊడిగం చేసే విధానాలు చేపట్టిన మోడీ ప్రభుత్వంపై సమర శంఖం పూరించిందని తెలిపారు. ఈ తరుణంలో 30వ తేదీ జిల్లాలో సిఐటియు జెండాలు ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిర్వహించాలని కార్మిక వర్గానికి కురుమూర్తి పిలుపునిచ్చారు. ఇందులో టౌన్ సీఐటీయూ కన్వీనర్ రాజ్ కుమార్, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వరద గాలన్న, దస్తప్ప, భరత్, నందు, మణికంత తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే బీసీ కులగణన చేపట్టాలి

- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ కులాల ఘనంకన చేపట్టి స్థానిక సంస్థలలో 42 శాతం బీసీలకు కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాల యంలో డి ఆర్ వో రవి కుమార్ కు వినతి పత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలప్రచారంలో కాంగ్రెస్పార్టీ కామారెడ్డి నియోజకవర్గం జరిగిన ఎన్నికల సభలోలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపు బీసీ కులాల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికల ను నిర్వహిస్తామని ప్రకటించి ఆరు నెలలు పూర్తి కావస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి కులగణన చేపట్టకుండా కాలయాపన చేస్తూ బీసీలను విస్మరించిందని మండిపడ్డారు. సకాలంలోఎన్నికలునిర్వహించకపోవడం వల్ల,గ్రామాలలో అభివృద్ధి కుంటుపడుతుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. లేనియెడల బీసీ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామనిహెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీసేన నాయకులు గొడుగు నర్సిములు, వెంకటేష్, శివశంకర్, కావాలి రాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న.. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు : డీఐఈఓ

- నాలుగో రోజు పరీక్షలకు 259 మంది గైర్హాజరు

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నాలుగో రోజు ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సం. సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా. శ్రీధర్ సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బుధవారం ప్రథమ, ద్వితీయ సం. గణితం/జువాలజీ/హిస్టరీ సబ్జెక్టులకు గాను పరీక్ష నిర్వహించబడింది. 21 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం మొత్తం 4393 మంది విద్యార్థులకు గాను 4213 మంది హాజరయ్యారు. 178 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరైనవారిలో మొత్తం ప్రథమ సం. 3960 జనరల్, 253 ఒకేషనల్ విద్యార్థులున్నారు. రెండవ సంవత్సరం మొత్తం 1409 మంది విద్యార్థులకు 1328 మంది హాజరయ్యారు. 81 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరైనవారిలో మొత్తం ద్వితీయ సం.1159 జనరల్, 169 ఒకేషనల్ విద్యార్థులున్నారు. రెండో రోజు డీఈసీ బృందం జడ్చర్ల, కోయిల్ కొండ మరియు స్థానిక ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల కేంద్రాలను సంద ర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సూచనలు చేసారు. ఇంటర్ బోర్డు నియమ నిబంధనల మేరకు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు నిర్వహించారు. తొలి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు కోసం ఏర్పాటు చేసారు. పరీక్ష సమయానికి విద్యార్థినీ, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొనేలా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్అమలు చేస్తూ, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు చేపట్టారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం ఛీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ సీ.ఎస్, డిపార్టెంటల్ అధికారులు, కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ సభ్యులు ఉమా మహేశ్వర్, రవీందర్ తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సమాయత్తం

- 1719 గ్రామ పంచాయితీలు, 74 జెడ్పీటీసీలకు సమరం
- రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికాగానే నోటిఫికేషన్
- ఇప్పటికే ప్రచారంలో ఆశావాహులు
- గ్రామాలలో నెలకొన్న సందడి

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

జిల్లాలో ఉన్న శాసనసభ , పార్లమెంటుకు జరిగిన ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల కోసమే జనవరిలో జరగాల్సిన స్థానిక సర్పంచుల ఎన్నికలు వాయిదా పడటంతో ప్రత్యేక అధికారుల పాలన గ్రామాలలో కొనసాగుతోంది. ప్రత్యేక అధికారుల పాలన ఆరు నెలలకు మించి ఉండరాదనేది నిబంధన. దీంతో ఎన్నికల కమీషన్ స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టింది. ఆ దిశగా అడుగులు వేస్తూ... రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేసుకొని ఎన్నికల నిర్వహణకు అడుగులు వేస్తోంది. శాసన సభ, పార్లమెంటు ఎన్నికలను పూర్తి చేసుకొని స్థానిక ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడి చల్లారక ముందే వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. మొదట స్థానిక ప్రజా ప్రతినిధులకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడదలయ్యింది. ఆ ఎన్నికల కోడ్ పూర్తికాగానే ఎమ్మెల్యే ఎన్నికల నోటిఫికేషన్ విడదలయ్యింది. నెల రోజుల పాటు ప్రచారం జరిగి ఉద్రిక్త వాతావరణంలో ఎమ్మెల్యే ఎన్నికలు ముగిశాయి. ఆతర్వాత వెను వెంటనే పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. మే 13న పార్లమెంటు ఎన్నికలు ముగిశాయి. తాజాగా స్థానిక సమరానికి తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల కోసం ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గద్వాల జిల్లాలో 255 గ్రామ పంచాయితీలు, వనపర్తిలో 255 నారాయణపేటలో 280 నాగర్‌కర్నూల్‌లో 461, మహబూబ్‌నగర్‌లో 468 గ్రామపంచాయితీలు ఉన్నాయి. 74 మండాలు ఉన్నాయి. పంచాయితీలకు సర్పంచులుగా మండలాలకు ఎంపీటీసీలు అభ్యర్థుల ఎంపిక కావల్సి ఉంది. వార్డులు, ప్రక్రియ పూర్తి చేసుకొని సర్పంచులకు సైతం రిజర్వేషన్ నిర్ణయించాల్సి ఉంది. ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా బీసీ జనాభా లెక్కించనదే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే.. బీసీలు నష్టపోతారనే వాదన వినిపిస్తోంది. 50 శాతం ఉన్న బీసీలు వాస్తవంగా జనాభాకు దగ్గ ఫలితాలు రావడం లేదన్న విమర్శలు లేకపోలేదు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీ గణన చేయాలన్న ఆలోచనలో ఉంది. ఆలస్యం అయితే స్థానిక ఎన్నికల నిర్వహణ పట్ల విమర్శలు వస్తాయని తెలుస్తోంది. రాజ్యాంగం ప్రకారం ఆరు నెలల



లోపే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం బావిస్తోంది.

ముందు గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే గ్రామపంచాయితీలకు ఎన్నికలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి కుంటుబడింది. పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా వంటి నిర్వహణ పనులు జరగడం లేదు. ఇక పంచాయితీలకు ఫండ్స్ ఇచ్చే ఎంపీపీ,జెడ్పీ చైర్మన్ వ్యవస్థలు లేకుంటే బడ్జేట్ సమస్య ఉంటుంది. అందుకే స్తానిక ఎన్నికలపై దృష్టి పెడుతున్నారు. ఇప్పటి నుంచి ఆశావాహులు ఇంటింటికి తీరుగుతూ.. సర్పంచుగా గెలిపించాలని కోరుతున్నారు. తమకే అవకాశం వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేలు , మంత్రుల చుట్టూ తిరుగుతూ మద్దతు ఇవ్వాలని వేడుకుంటున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తే... స్థానక సమరానికి సిద్ధమయ్యే అవకాశాలు కనపిస్తున్నాయి. లేదంటే ఇంకొన్ని రోజులు ఆలస్యం జరుగుతాయని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిష్పక్షపాతంగా కౌంటింగ్ నిర్వహించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జీ.రవినాయక్



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్

మహబూబ్ నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ఎన్నికల నిబంధనల ననుసరించి నిష్పక్షపాతంగా, సజావుగా,పారదర్శకంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జీ.రవినాయక్ అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరం లో మహబూబ్ నగర్ స్థానిక సంస్థ నియోజక వర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియపై కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కలిగించారు. రిటర్నింగ్ అధికారి,మహబూబ్ నగర్ కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో సిబ్బంది షెడ్యూలు సమయం కంటే ముందే రావాలని, సమయానికి రిపోర్ట్ చేయాలని, సెల్ ఫోన్లను తీసుకు రావద్దని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమం ప్రకారం ఓటర్లు ఓటు వేస్తారని, కాబట్టి కౌంటింగ్ లో భాగంగా మొదట ప్రారంభ లెక్కింపు చేపడతామన్నారు. కౌంటింగ్ కోసం ఐదు టేబుల్ లను ఏర్పాటు చేశామన్నారు ప్రారంభం లెక్కింపులో మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కిస్తారని అన్నారు. ప్రాథమిక లెక్కింపులో చెల్లిన ఓట్లు చెల్లని ఓట్ల వర్గీకరణలో పరిపూర్ణంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రారంభ లెక్కింపు అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుందని, మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తామని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు అనంతరం చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావలసిన కోటాను నిర్ధారిస్తామని అన్నారు. ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడు ఓట్లను సాధించినట్లయితే అతనిని గెలుపొందినట్లుగా ప్రకటిస్తామని, ఏ అభ్యర్థికీ కోటాకు కావలసిన ఓట్లు రానట్లయితే తదుపరి ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టి తదుపరి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కింపు జరుపుతామని అన్నారు. ఈ ప్రక్రియ ఏదేని అభ్యర్థి కోటాను సాధించేవరకు చేపడతామన్నారు. ఏ అభ్యర్థికీ కోటా రానట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొ ందినట్లుగా ప్రకటిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు,నారాయణ పేట అదనపు కలెక్టర్ మాయాంక్ మిట్టల్,షాద్ నగర్ ఆర్.డీ. ఓ.వెంకట మాధవ రావు,మహబూబ్ నగర్ ఆర్.డీ. ఓ నవీన్ తదితర అధికారులు పాల్గొన్నారు.



నాసిరకం పత్తి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు

- అందుబాటులో నాణ్యమైన పత్తి విత్తానాలు, ఎరువులు
- కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్



నవ తెలంగాణ - వనపర్తి

నాసిరకం విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని కలెక్టర్ తేజస్ నంద లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాసిరకం విత్తనాలు అనగా విత్తనాల ప్యాకెట్ పై లేబుల్ లేకుండా, ప్యాకింగ్ చేయని విత్తనాలను నాసిరకం విత్తనాలు అంటారని వాటిని ఎవరు అమ్మిన రైతులు కొనవద్దని ఎవరైనా అమ్మినట్లయితే ఆ విషయాన్ని వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. నాసిరకం విత్తనాలను అరికట్టడానికి ఇప్పటికే డీలర్ షాప్ లను తనిఖీ చేయడానికి స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారని తెలిపారు. జిల్లాలోని పత్తి రైతులకు 10వేల నాణ్యమైన పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ప్రకటించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని తెలియజేశారు. ఒకే బ్రాండ్ విత్తనాలు బాగుంటాయని అపోహ పడవద్దని ఏ కంపెనీ విత్తనాలు తీసుకున్న లేబుల్ ఉన్న కంపెనీ విత్తనాలు అన్ని బాగుంటాయని తెలిపారు. పచ్చరొట్ట పైరు విత్తనాలు 240 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలియజేశారు. వనపర్తి జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు ఎరువులు ఉన్నాయని, రైతుకు అనవసరంగా ఎక్కువ మోతాదులో కొని పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ప్రస్తుతం 19వేల టన్నుల యూరియా, 1226 టన్నుల డి. ఏ.పి, 254 టన్నుల పొటాష్, 335 టన్నులు సుపర్ ఫాస్పెట్, 5697 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఆర్థికసాయం



నవతెలంగాణ రాజాపూర్

రాజాపూర్ మండలకేంద్రనికి చెందిన ఉడిత్యాల నర్సింహ(40) అనారోగ్యంతో మృతి చెందారు. మృతికి సంతాపం తెలిపిన బీఆర్ఎస్ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.5000లు ఆర్థిక సహాయన్ని యువసేన సభ్యుల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ వనపర్తి దేవేందర్, అభిమన్యు యువసేన ఉపాధ్యక్షులు సున్నపు శ్రీనివాస్, రియాజ్, నవీన్, పుల్లయ్య గోపాల్, యువసేన సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నవతెలంగాణ - అయిజ

అయిజ మండల ఉప్పల గ్రామ పంచాయతీ పరిధిలోని తెలుగు చిన్న శంకర్ తండ్రి హనుమంతు అను యువరైతు కు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారు పెద్దవాగు సమీపంలోని ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. అనంతరం తన కుటుంబానికి ఈ గేదెనే ఆధారమని, ప్రతి రోజూ ఆ బర్రె ఇచ్చిన పాలను అమ్ముకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నానని, రూ.40 వేల విలువజేసే గేదె మృతి చెందడంతో తన కుటుంబం రోడ్డు పాలైందని బాధిత చిన్న శంకర్ వాపోయారు. విద్యుత్ శాఖ అధికారులు, నాయకులు స్పందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు.



నాసిరకం విత్తనాల క్రయ, విక్రయాల నియంత్రణకు చర్యలు

- గ్రామాలలో నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పటిష్ఠ నిఘా, చర్యలు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ రితిరాజ్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా , ఉత్పతి , విక్రయాలు జరిపి రైతులను మోసం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నాసిరకం విత్తనాలు అమ్మే వారి పట్ల రైతులు మోసపోకుండ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రితిరాజ్ తెలిపారు.ఆరుగాలం కష్టించి పని చేసే రైతులు మోసపోకుండా ఉండేందుకు జిల్లా లో నాసిరకం విత్తనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై జిల్లా ఎస్పీ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలో గతం లో నమోదైన నకిలీ విత్తనాల కేసుల వివరాలను పరిశీలించారు . ఆయా కేసులలో ఉన్న నిందితుల పై పోలీస్ అధికారులు నిఘా ఉంచాలని, ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారు, ఎలా జీవనం కొనసాగిస్తున్నారు.. తదితర వివరాలు తెలుసుకొని నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కేసులలో సాక్ష్యాధారాలు సేకరించడంతో పాటు ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్, ఏ. ఓ రిపోర్ట్ పకడ్బందీగా సబ్మిట్ చేసి ఆయా కేసులలో నిందితులకు శిక్షలు పడేందుకు కృషి చేయలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.... వర్షకాలం సమీపిస్తున్న వేళ గ్రామాలలో రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని, ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలలో వీపీఓల ద్వారా నిఘా పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో నకిలీ విత్తనాలు జిల్లాలోకి రావడం గాని, జిల్లా నుంచి బయటకు వెళ్లడం జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, విత్తనాలు అమ్మే షాపులు లలో నిఘా ఉంచి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలనీ , లూజ్ విత్తనాలను కొనుగోలు చేయవద్దని, గుర్తింపు పొందిన కంపెనీ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. ఎవరైన తక్కువకు విత్తనాలు వస్తాయంటే కొని మోసపోవద్దు అని , జర్మినేషన్ టెస్ట్ లో ఫెయిల్ అయిన విత్తనాలను విక్రయించే అవకాశం ఉందని వాటిని కొని మోసపోవద్దు అని, అలాగే ఇతర ప్రాంతాల నుంచి గ్రామాల్లోకి వచ్చి నకిలీ లేబుల్ తో అమ్మే విత్తన ప్యాకెట్స్ లను తీసుకోవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు .జిల్లా లో ఎవరైనా నాసిరకం విత్తనాలను అమ్మిన, సరఫరా చేసిన, అలాంటి వారికి సహకరించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అలాంటి వారి పై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం అరెస్టు పెండింగ్ కేసుల పై, ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్ కేసుల పై సమీక్షించి అధికారులకు తగు సూచనలు చేశారు.

కొత్త చట్టాల పై శిక్షణ తరగతులు..

జులై నెల నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టాలు భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) , భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) చట్టాల పై ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. కొత్త చట్టాల పై అవగాహన శిక్షణకు జిల్లా నుంచి వెళ్లి వచ్చిన పోలీస్ అధికారులతో ఇతర పోలీస్ అధికరులకు అవగహన కల్పించే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ మూడు కొత్త చట్టాలు నేరస్థులకు శిక్ష పడేవిదంగా చేయడం, బాధితులకు న్యాయం అందించడం పైన ఎక్కువ దృష్టి సారిస్తాయని తెలిపారు. సత్వర న్యాయం అందించడం, న్యాయ వ్యవస్థ, న్యాయస్థాన నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా 'భాధితులకు న్యాయం అందించడం' పై కేంద్రీకృతం చేయబడ్డాయని తెలిపారు. ఈ మూడు కొత్త చట్టాలకు డిసెంబర్ 21,2023న పార్లమెంట్ ఆమోదం లభించిందని తెలిపారు. బాధితుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణ, విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా అవసరమైన మెరుగులు దిద్దడం జరిగిందని తెలిపారు. క్రిమినల్ చట్టాలు కాలానుగుణంగా నవీకరించబడ్డాయని ,క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను మరియు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపై ఎస్పీ క్లుప్తంగా వివరించారు. తాజా , సవరించిన చట్టాలను అమల్లోకి తీసుకురావడంలో పోలీస్ శాఖ పాత్ర చాలా కీలకమని అన్నారు.కొత్త చట్టాలలో పేర్కొన్న శిక్షలు,నిబంధనల పట్ల జిల్లా పోలీస్ శాఖలో పనిచేసిన అధికారులు, సిబ్బంది అందరికీ ఈ చట్టాల పట్ల శిక్షణ పొందిన అధికారులతో జిల్లా వ్యాప్తంగా దశల వారీగా శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. క్రమశిక్షణతో ఈ శిక్షణా తరగతులను పూర్తిచేసుకుని చట్టాల పైన పూర్తి అవగాహన కలిగియుండాలని సూచించారు. ఈ సమీక్షలో డీ. ఎస్పీ సత్యనారాయణ , గద్వాల్ ఆలంపూర్, శాంతి నగర్ సీ. ఐ లు బీమ్ కుమార్, రవి బాబు, రత్నం, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, ఐటీ, డీసీ ఆర్బీ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-వనపర్తి

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాల్లో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుండి ప్రారంభమయ్యే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర ఏర్పాట్లు పక్కగా ఉండాలన్నారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు 964 మంది విద్యార్థులు హాజరు కేవలం సమయానికి కానున్నందున వనపర్తిలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులు సమయానికి నడపాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మౌలిక వసతులతో పాటు ప్రథమ చికిత్స కిట్లతో ఏఎన్ఎం, ఆశా వర్కర్లను నియమించాలని వైద్య అధికారిని ఆదేశించారు. పరీక్షలు జరుగనున్న ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచె విధంగా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, ఇతర శాఖల అధికారులు వీసీలో పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు సిద్ధం చేయాలి : కలెక్టర్

నవతెలంగాణ-వనపర్తి



పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పాఠశాలల్లో మౌలిక వసతులు సిద్ధం కావాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం పాన్‌గల్ మండల పరిధిలోని దావాజీపల్లి, దొండాయిపల్లి, రాయినిపల్లి గ్రామాల్లో సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశిలిలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాలు వేగవంతంగా నాణ్యతతో పూర్తి ఆదేశించారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్లు సహా చిన్న చిన్న మరమ్మతు పనులు పూర్తి చేయాలని సూచించారు. దావాజీపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. గుడ్లు, పాలు తదితర సామాగ్రి నిల్వలను పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మిబాయి, ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంపీఓ రఘురామ్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, పంచాయతి కార్యదర్శి శ్రీకాంత్, ఏపీఓ కురుమయ్య ఇంజనీరింగ్ అధికారుల్లీ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



బీజేపీని దించితేనే కార్మికుల మనుగడ : ఏఐటీయూసీ

నవతెలంగాణ - ఆత్మకూరు

దేశంలో బీజేపీ, నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే కార్మికులకు మనుగడ ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, ఉపాధ్యక్షులు టి.శ్రీహరి అన్నారు. ఆత్మకూర్ మండలం జూరాల గ్రామంలో మేడే మాస ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీహరి ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జూరాల గ్రామ శాఖ అధ్యక్షులు బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి నిర్వీర్యం చేశారన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా 8గంటల పని దినం సాధించుకోగా పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసం బీజేపీ పాలిత రాష్ట్రాలలో 12గంటలకు పెంచారని, దేశమంతట విస్తరించాలని చూస్తోందన్నారు. పేద, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, ఆదాని అంబానీ తదితర 22 మంది సంపన్నులకు దేశాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. మోడీ పాలనలో దేశంలో ఆకలి, నిరుద్యోగం, అధిక ధరలు, దళితులు, మహిళలపై అత్యా చారాలు పెరిగాయన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాలను బలోపేతం చేసుకుని కార్మికుల ప్రయోజనాల కోసం పోరాడాలన్నారు. పరమేష్, శివ, రాములు, రాజు, బలరాం, హమాలీలు, ఉపాధి కూలీలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ - వీపనగండ్ల

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైందని ఆప్తలామిక్ డాక్టర్ మురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60మందిని కంటి పరీక్షలు నిర్వహించగా 38 మంది కంటి ఆపరేషన్ కోసం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి ఆస్పత్రికి రెఫర్ చేయడం జరిగిందన్నారు. ఆపరేషన్ కోసం ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి ఆపరేషన్ చేసిన తర్వాత మళ్లీ ఇంటి దగ్గర విడిచిపెట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆదాయ గండీలో మార్కెట్ అధికారులే కీలకులు

- షాపుల పేరుతో అక్రమ వసూళ్లు..
- చర్యలు తీసుకోవాలంటు గ్రామస్తుల అవేదన



మదనాపురం : మార్కెట్ ఆదాయం పెరగకుండా తమ స్వార్థం కోసమే అధికారులు విచ్చలవిడిగా తెరలేపుతున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనాపురం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ దగ్గర సంబంధిత అధికారులు గత సంవత్సరంలో షెటర్లను కట్టి పలువురికి కిరాయికి ఇచ్చినట్లు ప్రజలు వెల్లడించారు. అయితే షాపులను నడిపిస్తున్న యజమానులు ప్రతినెల మార్కెట్ కార్యాలయానికి అద్దె కడుతున్నట్లు తెలుపుతున్నారు. చివర్ల ఉన్న తొమ్మిదవ షెటరును మిస్టర్ చాయ్ యజమానులు నిర్వహిస్తూ ఉంటున్నారని,అదనంగా పదవ షటరును కూడా వాడుతూ ఉండటం గమనార్హమని వ్యక్త పరుస్తున్నారు. గత నాలుగు నెలలుగా అదనంగా వాడుతున్న అట్టి గదికి కిరాయి ఎందుకు ఇవ్వడం లేదని గ్రామస్తులు కొందరు మార్కెట్ అధికా రులను అడిగితే మాట దాటవేసె ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడుస్తు సొంత స్వార్థ బజనకు షటర్ గదులను అప్పనంగా అప్పజెప్పి, నెలనెలకు మామ్ముళ్ళ మత్తులో తేలుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఖాళీగా ఉన్నటువంటి గదులను పలువురికి కిరాయికి ఇస్తే మార్కెట్ కార్యాలయానికి కొంతైనా ఆదాయం వస్తుందని సూచించారు. అక్రమ వసూళ్ల పేరుతో చూసి చూడనట్లు షటర్లను పట్టించుకోకుండా నిలువరిస్తున్న సంబంధిత అధికారులపై ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని, అలాంటి వారికిబుద్ధి చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

నాసిరకం విత్తనాలు కొని మోసపోవద్దు..

- ఏఈఓ స్పందన



నవతెలంగాణ - మదనాపురం

రైతులు విత్తనాలను కొనేటప్పు డు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవా లని మండల వ్యవసాయ అధికారిణి స్పందన తెలిపారు. మదనాపురం మండల పరిధిలోని కొన్నూర్, నర్సింగపురం గ్రామ రైతులతో బుధవారం నాడు సమావేశం నిర్వహించి వర్షాకాల పంటలపై తీసుకునే నియమాలపై అవగాహన కల్పించారు.ఏ దుకాణం నుంచి విత్తనాలను కొంటారో రసీదును తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లులను పంటకాలం పూర్తయ్యేవరకు భద్రంగా దాచుకోవాలని గుర్తు చేశారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆదికృత డీలర్ల దగ్గరనే కొనుగోలు చేయాలన్నారు. అధిక దిగుబడి వచ్చే మంచి పేరుగల విత్తనాలను ఎంచుకోవాలని, పత్తి, వరి పంటలపై తీసుకునే జాగ్రత్తలపై వివరించారు. రైతుల ఆశలను అదునుగా చేసుకొని గ్రామాలలో తిరుగుతూ ఎలాంటి లైసెన్స్ లేకుండా బిల్లులు ఇవ్వకుండా విత్తనాలను అమ్మాలని చూస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాంటి వారు రైతులను సంప్రదిస్తే అదికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతులు, యువకులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

పుట్టు చీర కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ఆత్మకూరు



మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామ కాంగ్రెస్ నాయకులు రాజన్న కుమార్తె దివ్య పుట్టుచీరల కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు దీవించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్మిక సంఘం అధ్యక్షులు కే.నాగరాజు గౌడ్, ఆత్మకూరు మండల అధ్యక్షులు పరమేష్, ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా, నాయకులు తులసిరాజు, శ్రీకాంత్, రవీందర్, వంశీ, నాగేశ్వర్, వెంకటన్న, అంబేద్కర్, దావీదు, పాల్గొన్నారు.

మదనాపురం : మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన ఆల్లిపురం చంద్రయ్య, భూత్పుర్ మధు కూతుర్ల పుట్టుచీర వేడుకలకు మదనాపురం మండల కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ కార్యదర్శి ఖాజా మైనద్దీన్, నాయకులు అక్కల మహదేవన్ గౌడ్, మల్లెపల్లి రవి, ఏటవాలి మాసన్న, దర్గకాడి వెంకటేష్, బత్తుల అంజి పాల్గొన్నారు.



ఐక్య పోరాటాల రథసారథి సీఐటీయూ

- జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు
- ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ - వనపర్తి

స్వాతంత్ర పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని సీఐటీయూ పనిచేస్తుందని, చారిత్రక అవసరాన్ని బట్టి ఐక్య పోరాటాల రథసారథిగా సీఐటీయూ ఆవిర్భవించిందని జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం జిల్లా కార్యాలయంలో కే.సునీత అధ్యక్షతన మంగళవారం సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ 1970 మే 30న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో 'ఐక్యత-పోరాటం' అనే నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. దేశవ్యాప్తంగా అనేక ఐక్య పోరాటాలు నిర్మించిందని, సరళీకరణ-ప్రైవేటీకరణ-ప్రపంచీకరణ విధానాలు 1991 లో పీవీ.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వచ్చాయన్నారు. ఈ విధానాలను తీవ్రంగా మొదటి నుంచి వ్యతిరేకించిన సంఘం సీఐటీయూ అని, మిగతా సంఘాలు కలిసి రాకపోయినా నాటి నుండి 1991 నుండి నేటి వరకు 22 జాతీయ సమ్మెలు నిర్వహించిందన్నారు. కార్మిక వర్గ హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు నాయకత్వం వహిస్తుందన్నారు. నేడు దేశంలో ఉన్న 11 కేంద్ర ట్రేడ్ యూనియన్‌లను ఐక్యం చేసిందని, అనేక సమ్మెల్లో కలిసి పోరాడిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణ విధానాలు వేగం పుంజుకున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మానిటైజేషన్ పైపులైను పేరుతో రూ.6లక్షల కోట్లకు కారుచౌకగా మోడీ అనుయాయులకు అప్పగిస్తుందని విమర్శించారు. నిరుద్యోగం, దారిద్రం పెరిగిందని, 10శాతం చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారని, 145దేశాల్లో ఆకలి సూచిలో 111వ దేశంగా భారతదేశం ఉందన్నారు. కార్పొరేటు కంపెనీలకు కార్పొరేట్ టాక్స్ మాఫీ చేశారని, 16లక్షల కోట్లు మాఫీ చేశారని, బ్యాంకులకు కార్పొరేట్లకు 15లక్షల కోట్లు మాఫీ చేశారన్నారు. పేదలను జీఎస్టీ పేరు మీద ఇతర పన్నుల పేరుతో పరోక్ష పనులు ఎక్కువగా వసూలు చేసి ధనవంతులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే అవినీతి డబ్బు తెచ్చి రూ.15 లక్షలు ఒక్కొక్కరి అకౌంట్లో వేస్తానని జన్‌ధన్ అకౌంట్లో ఓపెన్ చేయించారని, 15 రూపాయలు కూడా వేయలేదన్నారు. నేడు సెక్యులర్ రాజ్యాంగంగా ఉన్న లౌకిక రాజ్యాంగంలో ఈ భారత దేశంలో మతోన్మాదాన్ని పెంచి మతాన్ని ఓట్లకు ఉపయోగించుకుంటున్న నరేంద్ర మోడీ విధానాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని మెలగాలన్నారు. సీఐటీయూ కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేసేందుకు పనిచేస్తుందని, అనుబంధాలతో నిమిత్తం లేకుండా ఐక్య ఉద్యమాలను పెంపొందిస్తుందన్నారు. నేడు ఉన్న పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసి కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం సీఐటీయూ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నారాయణమ్మ, నందిమల్ల రాములు, బి.కవిత, లింగం శెట్టి, సాయిబాబు, బుచ్చమ్మ, గిరిజ గంధం మదన్, మద్దిలేటి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు భవన నిర్మాణ కార్మికులు, ఆస్పత్రి వర్కర్స్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : టీఎస్‌యూఈఈయూ



నవతెలంగాణ - వీపనగండ్ల

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న అన్ని రకాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో వనపర్తి సర్కిల్ విద్యుత్ ఎస్ఈకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూఈఈయూ, అనుబంధ సంఘం జిల్లా నాయకులు మోహన్, మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, ఆర్టిజెన్స్ అన్ మెన్, పీస్ రేట్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ట్రాన్స్‌కో యాజమాన్యానికి ఫిబ్రవరి 26న వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. నేటికీ యాజమాన్యం ఇంతవరకు స్పందించని కారణంగా దశల వారి కార్యక్రమాలు చేయాలని మా యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే బుధవారం ఎస్ఈకి వినతిపత్రం అందజేశామన్నారు. ఆర్టిజన్ కార్మికుల కార్మికుల అందర్నీ విద్యారతను బట్టి జేఎల్ఎం, జేపీఎ, జూనియర్ అసిస్టెంట్ ఆఫీస్ సబార్డినెట్, సబ్ ఇంజనీర్ తదితర రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ చేయాలన్నారు. అన్‌మ్యాన్ వ్యవస్థను రద్దుచేసి అట్టి కార్మికులను సంస్థలో విలీనం చేసుకొని రెగ్యులేస్ చేయాలన్నారు. అంతలోగా ఆర్‌టి జెన్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. ఏపీ ఎస్ఈబీ కాలం నుండి మన సంస్థను నమ్ముకుని పని చేస్తున్న ప్రైవేటు మీటర్ లీడర్స్, బిల్ కలెక్టర్, వాచ్ అండ్ వార్డ్ కార్మికుల సేవలను గుర్తించి ఈ కార్మికులందరినీ సంస్థలో వినీల విలీనం చేసుకొని ఆర్‌టిజన్స్‌గా గుర్తించాలన్నారు. కనీస వేతనం జీవో అమలుచేసి ఈఎస్ఐ, పీఎఫ్ మరియు మెడికల్ క్రెడిట్ కార్డ్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో ఉద్యోగులకు ఈపీఎఫ్ విధానాన్ని రద్దుచేసి జీపీఎఫ్ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పెండింగ్ తేదీ.1-7-2023 డీఏ ఏరియాస్, తేదీ.1-1-2024 డీఏ వెంటనే విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాల్లో పాత నిబంధనల ప్రకారం విద్యార్హతకు తగ్గ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూఈఈయూ నాయకులు బాలరాజ్, మస్తాన్, ఆనంద్ గౌడ్, వినయ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేల వర్ధంతి, జయంతులు పట్టవా..?

- బీసీలంటే అగ్రవర్ణ నాయకులకు చులకనా..!
- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

నవతెలంగాణ - వనపర్తి

వనపర్తి శాసనసభ నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించి అమరులైన డాక్టర్ బాలకృష్ణయ్య, అయ్యప్ప, జయరాములు వంటి బీసీ నేతల జయంతి, వర్ధంతి సభలను మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు నిర్వహించకపోవడం విడ్డూరమని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేల జయంతి, వర్ధంతి సభలను గోపాల నిర్వహించడం బాగుందన్నారు. కానీ బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ నాయకులను స్మరించుకోవడం, వారి సేవలను గుర్తు చేసుకోవడం నేటి ప్రజా ప్రతినిధులకు ఎంతో అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే లైన్ బాలకృష్ణయ్య అయ్యప్ప జయరాములు వనపర్తి నియోజకవర్గానికి చేసిన సేవలను స్మరించుకోవడంలో బీసీ నాయకులకు స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జయరాములు వర్ధంతి రోజు బీసీ సదస్సు నిర్వహించి విజయవంతం చేసినందుకు ఓ సామాజిక వర్గమైన నాయకులకు నచ్చకపోవడం, సదస్సుకు హాజరైన ఇతర నాయకులను దుర్భాషలాడటం వంటి చేష్టలు వారి హోదాకి, నాయకత్వ లక్షణానికి తగదని సూచించారు. బీసీ నేతల వర్ధంతి జయంతులను జరపడం అవసరం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజా సేవలో ఉండే ప్రతి నాయకుడిని రాజకీయ నాయకులంతా ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఇలాంటి చర్యలను బీసీ నాయకులుగా ఖండిస్తున్నామని తెలిపారు. మాజీ నేతలను గుర్తుంచుకోలేని చరిత్ర హీనులు మీరని ఎద్దేవా చేశారు. బీసీ సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానం పంపినా పట్టించుకోలేదని, ఆ సదస్సు విజయవంతం కావడంతో ఇద్దరు మాజీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. మీరు గుర్తించని ఎమ్మెల్యేల సేవలను ప్రజలకు తెలిసేలా తాము బాధ్యత బాధ్యత తీసుకుని వారి విగ్రహాలు పెట్టాలని, వారికి నివాళులర్పించాలని కోరడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. నీతి నిజాయితీపరులైన అయ్యప్ప, జయరాములు, డాక్టర్ బాలకృష్ణయ్యల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జయరాములు పేరుమీద గెస్ట్ హౌస్‌ను తొలగించి మీకుహనా బుద్ధిని చాటుకున్నారని పేర్కొన్నారు. మాజీ నాయకుల సేవలను ప్రజలకు వివరించడం మనందరి బాధ్యతని, ఇందులో ఎలాంటి రాజకీయం అవసరంలేదని హితవు పలికారు. వారు వనపర్తికి ఎంతో సేవ చేశారు వారి విగ్రహాలు పెట్టాలని గత నాలుగు సంవత్సరాలుగా మేము పోరాడుతుంటే పార్టీలు అంటగట్టి వారిని అవమానించారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలంతా మీరే ఉన్నారని, కనుక స్థానిక సంస్థలు ఎన్నికలకు ముందే కుల గణన చేసి దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని ఐదు జడ్పీ చైర్మన్లు, ఇతర జడ్పీటీసీలు, ఎంపీపీలు ఎక్కువ శాతం బీసీల కేటాయించాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ లకు ,అగ్రవర్ణాలలో కోమటి, రెడ్డి, బ్రాహ్మణ, కులస్తులకు కూడా వారి దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని ఆ ప్రకటనలో ఆయన కోరారు.

పెండింగ్ రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక

- ఎమ్మెల్యే మేఘా రెడ్డి చొరవతో పనులు ప్రారంభం
- త్వరలో ప్రజలకు తొలగనున్న ఇబ్బందులు



నవ తెలంగాణ - వనపర్తి

వనపర్తి పట్టణంలో సుమారు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పనులకు మోక్షం కలిగింది. ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆదేశాలతో బుధవారం జిల్లా కేంద్రంలో విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గతంలో రోడ్ల విస్తరణలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయాలు కలుగుతున్నాయని గుర్తించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంట్రాక్టర్లకు బకాయి సొమ్ము ఇప్పించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేయడంతో ఈ మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కాంట్రాక్టర్లకు డబ్బును రిలీజ్ చేసింది. రూ.25కోట్ల డబ్బులను కాంట్రాక్టర్లకు ఇప్పించడంతో ఈ మేరకు బుధవారం వనపర్తిలో పెండింగ్ ఉన్నచోట్ల విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే పట్టణ ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలు ఇబ్బందులు ఎమ్మెల్యే కృషితో తొలగనున్నాయి ఎన్ని రోజులు ఎమ్మెల్యే మెఘారెడ్డి విస్తరణ పనులు చేపట్టడం లేదని వాదించిన ఇతతండవాదులకు ఇదో చెంపపెట్టు నిదర్శనం ఈ పనులను. బుధవారం వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, అసెంబ్లీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ పరిశీలించారు. వనపర్తిలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. ప్రజల ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అందరూ మెచ్చేలా అభివృద్ధి పనులు త్వరగతిన పూర్తికానున్నాయని వారు వ్యాఖ్యానించారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ వర్తింపచేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు

నవతెలంగాణ-వీపనగండ్ల

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు వేసవి అలవెన్సులు వర్తింప చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని బొల్లారం, తూముకుంట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల దగ్గరికి వ్యవసాయ కార్మిక సంఘం బృందం వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మేకల ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశాలలో టెంటు సౌకర్యం, తాగునీటి వసతి, మెడికల్ కిట్ బాక్స్ వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. పాలకప్రభుత్వాలు ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ఉపాధికి నిధులు తగ్గించిందన్నారు. ఉపాధి నిధులను ఇతర రంగాలకు దారి మళ్లిస్తూ ఉపాధి కూలీల పొట్ట కొడుతుంద న్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తూ పేద ప్రజలపై భారాలు మోగుతుందన్నారు. ధరలను తగ్గించడంలో యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 600 రూపాయలు రోజు కూలి చెల్లించాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరు వారాలు అవుతున్న కూలీలకు కూలి డబ్బులు రావడం లేదు అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని లేనిచో కూలీలను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. జూన్ 6వ తేదిన వనపర్తి జిల్లా కేంద్రంలో తలపట్టిన దర్నా కార్యక్రమాన్నికి కూలీలు భారీ ఎత్తున తరలిరవాలిని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నర్సింమ గౌడ్, బాలగౌడ్, రజిత, శిల్ప, సాయి, లక్ష్మి, రాముడు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



కూలిన మట్టి మిద్దె.. తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ-వీపనగండ్ల

మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో ముంత కురుమయ్య చెందిన మట్టిమిద్దె ఇల్లు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా కూలిపోయిం ది. గ్రామస్తులు వివరాల ప్రకారం కురుమయ్యతో పాటు భార్య కృష్ణమ్మ ఇంటి ముందు కూర్చున్నారు. ఆకస్మికంగా పైకప్పు మొత్తం కూలి నేలమట్టం అయింది. ఇంట్లో ఉన్న సామాగ్రి మట్టిలో పేరుకుపోయాయి పెద్ద ప్రమా దం తప్పిందని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి సెంటు భూమి లేదు రోజు వారి కూలి పని చేసుకుని కుటుం బాన్ని పోషించుకోవడం జరుగుతుంది. సుమారు ఐదు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి..

గోవర్ధనగిరి గ్రామంలో ముంత కురుమయ్య ఇల్లు అస్మికంగా కూలిపోయిన కుటుంబ సభ్యుల్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, రైతు సంఘం గ్రామ నాయకులు పడిగన్న, మత్స్య కార్మిక సంఘం నాయకులు దర్గేష్, మాజీ సర్పంచ్ బాబు నాయుడు కూలిన మట్టి కూలిన మట్టి మిద్దె ఇంటిని పరిశీలించారు. సంఘటన సంబంధించిన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబం ఇల్లు కూలిపోయి రోడ్డున పడ్డారని , ప్రభుత్వం బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు, మట్టిలో కురుకపోయాయన్నారు .బాధితులకు డబల్ బెడ్ రూమ్ గురించి, 10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న రైతు సదస్సులు



ఆత్మకూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆరేపల్లి, తిప్పడంపల్లి, గ్రామాలలో రైతులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి సింధుజ మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని, ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని తెలియ జేశారు. అదేవిధంగా విత్తన కొనుగోలు చేసినప్పుడు రసీదును భద్రంగా ఉంచుకోవాలని, పంటకాలం పూర్తి అయ్యేనాటికి రైతులు వాటి రసీదులను భద్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల యూనిఫామ్స్ సకాలంలో అదించాలి

- అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-బిజినేపల్లి

మహిళా సమైక్య ఆధ్వర్యంలో కుడుతున్న పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ సకాలంలో పాఠశాలలకు అందించాలని అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం మండల ఇందిరా క్రాంతి భవనంలో పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టడం పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. మొత్తం 5411 యూనిఫారాలకు గాను 2వేల యూనిఫారాలు కుట్టడం పూర్తయిందని, స్కూలు తెరిచేలోపు మిగతా యూనిఫారాలు కుట్టి అందిస్తామని ఇందిరా క్రాంతి పతం ఏపీఎం రజిత తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన స్కూలు తెరిచేలోపు యూనిఫారాలు కుట్టడం పూర్తి చేయాలని ఏసీఎల్బీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ.కథలప్ప, ఎంపీఓ రాముల నాయక్, ఏపీఎం రజిత, సీసీలు రామస్వామి, లక్ష్మణ్, కమల, ప్రశాంత్, శంకర్, కంప్యూటర్ ఆపరేటర్ స్వామి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన



నవతెలంగాణ-పెంట్లవెల్లి

మండలం కేంద్రంలో మాధవస్వామి నగర్‌లో బుధవారం డీఆర్‌డీఓ చిన్న ఓబులేషు, పెంట్లవెల్లి మండలం ఎంపీడీవో ప్రసన్నకుమారి ఉపాధి హామీ పథక నిర్వహణను, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఉపాధి హామీ పని నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, ఉపాధి హామీ కూలీలను ఏమైనా సమస్యలు ఉన్నాయ్యా అని వారు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మాధవస్వామి నగర్‌లో చాలా అద్భుతంగా రూపుదిద్దుకున్న పల్లె ప్రకృతి వనాన్ని చూసి వారు ఆశ్చర్యకృతులయ్యారు. ఈ పల్లె ప్రకృతి వనని ఇంత అద్భుతంగా రూపుదిద్దిన గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్‌ను ఆయనకు సహకరించిన వర్కర్స్‌ను, గ్రామ ప్రజలను వారు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ మరో పార్కుకు 8వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. తనకు వీలైనంతవరకు మొక్కలు పెరుగుదలకు తనవంతు కృషి చేస్తానని గ్రామ ప్రజలు చాలా చక్కగా సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, ఏపీవో మోహన్, ఈసీ జయదీప్, సీనియర్ మేటి రాము, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు కొనుగోలుపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని వడ్డేమాన్, శాయిన్‌పల్లి గ్రామాలలో విత్తనల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాలలో ఎవరైనా లూజు విత్తనాలు అమ్మినట్లయితే వ్యవసాయ అధికారులకు ఇంటిమేషన్ ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో ఎవరూ లూజ్ విత్తనాలను కొనకూడదని రైతులకు వివరించారు. విత్తనాలు కొనేటప్పుడు రైతులు డేట్ అఫ్ ప్యాకింగ్, డేటా టెస్టింగ్, డేటాఫ్ ఎక్స్‌పైరీ, జీఈఏసీ అప్రూవ్డ్ ఉందో లేదో సరిచూసుకోవాలని రైతులకు సూచించారు. ఎవరు కూడా రైతులు ఎమ్మార్పీ కంటే విత్తనాలను ఎక్కువ ధరకు కొనకూడదని తెలిపారు. ఎవరైనా డీలరు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మినట్టయితే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని సూచించారు. తదనంతరం శ్రీ సాయి ట్రేడర్స్, సాయి తిరుమల ట్రేడర్స్, శ్రీ గౌతమి ట్రేడర్స్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పత్తి విత్తనాలు, కంది విత్తనాలు, జనుము విత్తనాలు శాంపిల్స్ తీసి మలక్పేట్ ల్యాబ్, జడ్చర్ల ల్యాబ్ పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగర్‌కర్నూల్ రమేష్ బాబు, ఏవో బిజినపల్లి నీతి, శాయిన్‌పల్లి ఏఈఓ ఫరీద్ పాషా, వడ్డేమాన్ ఏఈఓ మధు, శయిన్‌పల్లి ఎంపీటీసీ చిన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విత్తన కేంద్రాలు తనిఖీ



నవతెలంగాణ-బల్మూరు

మండల పరిధిలోని కొండనాగుల, బల్మూరు గ్రామాలలో సీడు, ఫెర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ శాఖ ఇన్‌స్పెక్షన్ స్క్వాడ్ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. సీడ్ డీలర్లందరూ విత్తనాల సరఫరాకు సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలు భద్రపరచి, రైతులకు పూర్తి వివరాలతో కూడిన రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఎమ్మార్పీ ధరలకు మించి ఎవరు అమ్మిన కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్రతి రైతు రసీదు తీసుకోవాలన్నారు. రసీదులో విత్తన రకం, లాట్ నెంబర్, ధర, పరిమాణం సరిచూసుకోవాలన్నారు. ఈ తనిఖీలో ఏడీఏ కిరణ్ కుమార్, ఏవో టెక్నికల్ పల్లవి, మండల వ్యవసాయాధికారి మహేష్ కుమార్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులకు లైసెన్సులు తప్పనిసరి

- ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి శ్రీరామ్

నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి



మండలంలోని విత్తన, పురుగు మందుల, ఎరువుల దుకాణదారుల యజమలకు తప్పనిసరిగా లైసెన్సులు ఉండాలని లైసెన్స్ లేకుండా క్రయవిక్రయాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఫర్టిలైజర్, పురుగుమందుల యజమానుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్ వస్తుంది. కావున ఫర్టిలైజర్ షాప్ యజమానులు లైసెన్సులు రివల్ చేసుకునేవారు ఉంటే వెంటనె రినివల్ చేసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, పురుగుమందులు తీసుకున్న వెంటనే తప్పకుండా బిల్ ఇవ్వాలని, నకిలీ విత్తనాలు గాని, డేటు ముగిసిన విత్తనాలను అమ్మ రాదని అలాగే అందరూ తప్పకుండా లైసెన్సులు ఉన్న డీలర్లే విత్తనాలు, పురుగుమందులు రైతులకు అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ముజీబ్, జానకి రాములు, పలు గ్రామాల ఫర్టిలైజర్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 31 ఆఖరి తేదీ

- సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

ఎస్సీ గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేవారికి ఈనెల 31 ఆఖరు తేదీ అని మండల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అకుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అచ్చంపేట జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఏకగ్రీవంగా ఎన్నిక

నవతెలంగాణ-అచ్చంపేట



అచ్చంపేట జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులుగా బండారు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కాలూరి శ్రీనివాసులు ఎన్నికైనట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యమ్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో జిల్లా కో-ఆపరేటివ్ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ముందుగా 11 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బండారు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కాలురి శ్రీనివాసులు, కోశాధికారిగా దుమార్ల భాస్కర్, ఉపాధ్యక్షులుగా బాణల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు కో-ఆపరేటివ్ జూనియర్ ఇన్‌స్పెక్టర్స్ మహమ్మద్ కుతుబుద్దీన్, పి.సబిత అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.భాగ్యమ్మకు సహకరించారు. అచ్చంపేట జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అధ్యక్షులు బండారు శ్రీనివాసులు, తాలూరి శ్రీనులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో భాగంగా సభ్యులందరికీ ఇండ్లస్థలాలు అందరికీ వచ్చే విధంగా కృషి చేస్తామని వారు తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో..

ఎవ్వరూ ఉండరు.. ఎప్పుడూ ఇంతే..!

- అనారోగ్య బాధితుల ఆగ్రహం
- పేరుకే ఇద్దరు డాక్టర్లు
- అటెండర్లచే బిపి ఓపి చెకప్
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు





నవతెలంగాణ - బల్మూరు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది విధులకు రాని కారణంగా వైద్యం కోసం వచ్చిన రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ దవఖానల ఎవ్వరూ ఉండరు ఎప్పుడు ఇంతే అంటూ రోగులు వాపోయారు. ఆరోగ్య కేంద్రానికి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు టీకాలు ఇప్పించేందుకు, ఆయా గ్రామాల నుండి ప్రజలు వస్తుంటారు. కానీ ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా రాకపోవడంతో ఉన్న ఇద్దరు ముగ్గురు సిబ్బందితో చూయించుకొని పోతున్నామని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ఉండే సిబ్బంది ఎందుకు రారంటూ ప్రశ్నిస్తున్నారు.



మండల కేంద్రంలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో పేరుకే ఇద్దరు డాక్టర్లు ఉన్నారని వారు ఎప్పుడు సక్రమంగా విధులకు రారని చికిత్స కోసం వచ్చిన రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి ఒక వైద్యాధికారి, ఆయుష విభాగం నుండి ఒక వైద్యాధికారి ఉన్నప్పటికీ ఎవరు రాకపోవడం పట్ల ఆయా గ్రామాల నుండి వచ్చిన ప్రజలు విచారణ వ్యక్తం చేస్తున్నారు.



వచ్చిన ఇద్దరు ముగ్గురు సిబ్బందితో తాము చూయించుకుంటున్నామని రోగులు తెలిపారు. అటెండర్లు ఒకరు బీపీ చెకప్ చేస్తుండగా మరొకరు ఓపిలో మందులు ఇస్తున్నారని, వచ్చిన చాలామందికి వైద్యం సరిగా అందడం లేదని, అందుకే కొంతమంది వెనిదిరిగి పోతున్నారని ప్రజలు తెలిపారు. ప్రస్తుతం అనారోగ్యాల బారిన ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యాలను ఎదుర్కొంటున్నారని మండల కేంద్రంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వస్తే సిబ్బంది లేకపోవడంతో వేనుతిరిగి పోతున్నామని మరికొందరు వాపోయారు.

ప్రస్తుత సీజన్లోనైనా ఆరోగ్య కేంద్రానికి పూర్తిస్థాయిలో సిబ్బంది వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆయా గ్రామాల, మండల ప్రజలు కోరుతున్నారు. పేరుకు మాత్రమే 24గంటల వైద్య సేవలని ఉన్నప్పటికీ ఉదయం 12గంటలు దాటిందంటే ఎవరు ఉండరని, రాత్రి సమయాలలో కూడా ఎవరూ విధులలో ఉండరని ప్రజలు వాపోయారు. అందుకే వైద్యం కోసం రాత్రి సమయాలలో అచ్చంపేట వంటి పట్టణాలకు వ్యయ ప్రయాసలపై వెళ్ళవలసి వస్తుందని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలన





నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కుమార్ దీపక్ పరిశీలించారు. గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, సీపీఎస్, పీఎస్ హెచ్‌సీ, పీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలకు కావలసిన కనీస వసతుల ను పరిశీలించారు. అనంతరం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీరాజ్ ఇంజనీర్లతో మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం దృష్టిలో ఉంచుకొని పాఠశాలల్లో మంచినీటి సౌక ర్యం, విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్లు, నల్లబల్లలు, పాఠశాలలకు కావలసిన కనీస సౌకర్యాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం లో నాగర్‌కర్నూల్ ఎంపీడీవో బి.శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈఎం సంపత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, వకుళ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు శెట్టి, తుడుకుర్తి గ్రామ పంచాయతీ సెక్రటరీ రవీందర్ పాల్గొన్నారు.





జూన్ 3 నుండి 19 వరకు బడిబాట : డీఈఓ

నవతెలంగాణ-కందనూలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించడం, విద్యార్థుల నమోదును పెంచడం కోసం రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల పరిధిలో జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజులు బుధవారం తెలిపారు. జూన్ 3 నుంచి 19 వరకు ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఎన్‌రోల్‌మెంట్‌డ్రైవ్‌ను చేపడుతామన్నారు. జూన్ 12 నుంచి బడులు పునఃప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా పండుగ వాతావరణంలో బడులను తెరువాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించి ప్రభుత్వ బడిపై వారికి భరోసా కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్, మున్సిపల్, డీఆర్‌డీఏ, లేబర్, వైద్య ఆరోగ్య, అన్ని సంక్షేమ శాఖలు, మహిళా సమైక్య సంఘాలతో సమన్వయం చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, స్వయం సహాయక బృందాలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు భారీగా నమోదు అయ్యేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య, పాఠశాల విద్యార్థుల గత విజయాలను వివరించి పిల్లలను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్వాడీ టీచర్లతో ప్రత్యేకంగా మాట్లాడి పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో అందరినీ బడిబాటలో భాగస్వామ్యం చేయాలన్నారు. బడిఈడు పిల్లలందరూ బడిలో నమోదు అయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చూడాలని ఆయన కోరారు. బడిబాట కార్యక్రమంలో నిర్వహించాల్సిన రోజు వారిగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని డీఈఓ సూచించారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

నవతెలంగాణ-తెలకపల్లి



పురుగుల మందు తాగి మహిళా మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై బి.నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కారువంగా గ్రామానికి చెందిన చింత కృష్ణమ్మ(33) అనే మహిళ కుటుంబ కలహాల నేపథ్యంతో మంగళవారం సాయంత్రం భర్తతో గొడవపడి పురుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి గాజుల బాలకిష్టమ్మ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా బూసి రామచంద్రారెడ్డి 15వ వర్ధంతి సభ

నవతెలంగాణ-అచ్చంపేట

మండల పరిధిలోని ఐనోల్ గ్రామంలో బుధవారం బూసి రామచంద్రారెడ్డి 15వ వర్ధంతి సభను సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామచంద్రారెడ్డి చిత్రపటానికి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు లింగారెడ్డి, రామచంద్రారెడ్డి కుమారుడు మణిపాల్ రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. గ్రామస్తులు పూలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.మల్లేష్ పాల్గొని మాట్లాడారు. రామచంద్రారెడ్డి గొప్ప భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదల కోసం పనిచేయ డానికి సీపీఐ(ఎం) పార్టీని ఈ ప్రాంతంలో గ్రామ గ్రామాన ఎర్ర జెండాలు ఎగిరేయడానికి ముందుకు వచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు. రామచంద్రారెడ్డి బతికిన కాలంలో గ్రామంలో సంపత్తి భోజనాలు ఏర్పాటు చేసి, ఎక్కువ తక్కువలు లేకుండా అందరూ కలిసి భోజనం చేసే వాళ్లన్నారు. రామచంద్రారెడ్డి నక్సలైట్లు వచ్చి బెదిరించిన భయ పడని గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ ప్రాంతంలో సీపీఐ(ఎం) నాయకులు అంతయ్య, రహీం, సుధాకర్ రెడ్డి, కొట్టే పర్వాలు, నిరంజన్, వీళ్ళందర్నీ కూడా నక్సలైట్లు పొట్టన పెట్టుకున్నారన్నారు. రామచంద్రారెడ్డి బ్రతికినంత కాలం పేదల కోసమే పని చేశారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాలు ఉదయం ఒక పార్టీలో ఉండి సాయంత్రం మరో పార్టీకి మారుతున్నారు. కానీ రామచంద్రారెడ్డి తన 50ఏండ్ల రాజకీయ జీవితంలో ఎర్రజెండా వారసత్వాన్ని కొనసాగించినాడని గుర్తు చేశారు. గ్రామంలో భూమిలేని నిరుపేదలకు భూమిని పంచిన గొప్ప మనసు గల వ్యక్తి రామచంద్రారెడ్డి అని కొనియాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తినే తిండి పైన, కట్టే బట్టల పైన ఆంక్షలు విధిస్తున్నారు. పేదల పైన అనేక భారాలు మోపుతూ



ధరలను విపరీతంగా పెంచుతున్నారన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు ఫలితంగా పెంచారని, మనం తాగే పాలు, పెరుగు మీద కూడా జీఎస్టీ విధించారన్నారు. రాబోయే కాలంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చంద్రయ్య, వెంకటయ్య, బుల్లు చిన్నయ్య, హెమ్లా నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లిపై ఆరోపణలు సరికాదు

- కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కబీర్,
- మండల అధ్యక్షులు మధుగం నరసింహ యాదవ్

నవతెలంగాణ-పెంట్లవెల్లి

మంత్రి జూపల్లి కృష్ణారావుపై ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కబీర్, మండల అధ్యక్షులు మధుగం నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ శవ రాజకీయాలు చేస్తుందన్నారు. శ్రీధర్ రెడ్డి హత్యను కావాలని కాంగ్రెస్ పార్టీపై, మంత్రి జూపల్లిపై మళ్లించే ప్రయత్నం చేస్తుందన్నారు. గత 24 సంవత్సరాలుగా రాజకీయంలో ఏ ఒక్క మచ్చ లేకుండా తన రాజకీయ జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన ప్రజానాయకుడు జూపల్లిపై నిందలు మోపడం సరికాదన్నారు.



బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షం లేకుండా చేసిందని ప్రతిపక్షాన్ని అణిచివేసిందని వారన్నారు. ఒక బహుజన నాయకుడు సింగోటం రామన్న మరణించినప్పుడు పట్టించుకోని ప్రభుత్వం అగ్రవర్ణాలకు చెందినటువంటి వ్యక్తి చనిపోవడంతో శవ రాజకీయాలను చేసి కాంగ్రెస్‌పై నిందలు మోపుతున్నారని వారన్నారు. శ్రీధర్ రెడ్డి హత్యను మేము కూడా ఖండిస్తున్నామని, కానీ ఆ హత్యను కాంగ్రెస్ పార్టీపై రుద్దడం సరికాదని వారన్నారు. హత్యకు కారణమైనటువంటి వాళ్లను కచ్చితంగా న్యాయస్థానం శిక్షిస్తుందని ఇప్పటికే హత్యపై గల కారణాలను తెలుసుకోవడానికి స్పెషల్ పోలీస్ టీం ఇన్వెస్టిగేషన్ చేస్తుందని వారన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రతిపక్షాలను ఎంతగానో ఇబ్బంది పెట్టి బ్లాక్మెయిల్ చేసి ఎంతోమంది నాయకులను తమ పార్టీలోకి బలవంతంగా లాక్కొని రాష్ట్రం మొత్తం ప్రతిపక్షం లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే ఉండాలని, ఆ పార్టీ అధినాయకులు కుట్రలు పన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఏనాడు హత్యా రాజకీయాలు చేయలేదని వారన్నారు. ప్రజల కోసం ప్రజాపాలనలో భాగంగా ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుందని, అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం సరికాదని వారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గోవింద్ గౌడ్, పెంట్లవెల్లి మండలం సింగిల్ విండో చైర్మన్ డి.రామన్ గౌడ్, కొండూరు మాజీ సర్పంచ్ గోపాల్, పెంట్లవెల్లి మండలం వైస్ ఎంపీపీ భీమ్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, పెంట్లవెల్లి ఎంపీటీసీ శేషు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు భోగ్యం నరసింహనాయుడు, గోప్లాపూర్ యువ నాయకుడు శినిగిరి శంకర్, ఆవుట ఎర్ర శ్రీనివాసులు, తెలుగు గోపాల్, శేఖర్, వెంకటయ్య ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నారాయణపేట-గద్వాల
గురువారం | మే 30, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు



నవ తెలంగాణ - ధన్వాడ

రాష్ట్ర నెట్‌బాల్ సంఘం ఆదేశాల అనుసారం హైదరాబాద్ జిల్లా నెట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జూన్ 1 వరకు గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ దోమలగూడలో జరిగే 7వ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో పాల్గొనేందుకు నారాయణపేట జిల్లా పురుషుల, మహిళల జట్లు ప్రయాణమయ్యాయి. గత ఐదు రోజులుగా జెడ్ పీ హెచ్ ఎస్ బాలుర క్రీడా ప్రాంగణంలో ధన్వాడ యువకుల సహకారంతో క్యాంపులో పాల్గొని వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ మండల నెట్ బాల్ సంఘం గౌరవ అధ్యక్షులు శెట్టి రమేష్ , కార్యనిర్వాక కార్యదర్శి సుదర్శన్ గౌడ్ , కోచ్ డాక్టర్ రామ్మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



నవ తెలంగాణ - నారాయణపేట

మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు బుధవారం ఆదేశించారు. మహబూబ్‌నగర్ పాలమూర్ యూనివర్సిటీలో అసెంబ్లీ సెగ్మెంట్ లైన నారాయణపేట, మక్తల్ నియోజకవర్గలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ తనిఖీ చేసి కౌంటి ంగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పరిశీలించారు. పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్, ఆర్డీఓ మధు మోహన్, తహసీల్దార్ సింధూజ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు ప్రణాళికతో చదవాలి

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళికతో ఇష్టంగా చదివి విజయం సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అపూర్వ చౌహాన్ అన్నారు. బుధవారం ఐడీఓసీ లోని తన ఛాంబర్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటికే బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 60 మంది అభ్యర్థులకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన మెటీరియల్‌లోని అంశాలను కూడా క్షుణ్ణంగా చదివి ప్రిలిమ్స్ పరీక్షను అభ్యర్థులు మంచిగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి శ్వేతా ప్రియదర్శిని, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

- అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

జోగులాంబ గద్వాల జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఐ డీ ఓ సీ లోని తన ఛాంబర్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనకు నార్కోటెక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థాల సరఫరా లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ ను విక్రయించకుండా పూర్తి నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై జూన్ చివరి వారంలో ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మత్తు పదార్థాలను ప్రజలు వినియోగించకుండా, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆర్.డీ. ఓ రామ్ చందర్, డీ. ఎస్. పీ సత్య నారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్, డీ.డబ్ల్యూ. ఓ సుధారాణి, ఎఫ్.ఆర్.ఓ దేవరాజు, డీ.సీ.పీ.ఓ నరసింహ పాల్గొన్నారు.

పట్టాపాస్ పుస్తకాలను పరిశీలించిన అడిషనల్ రెవెన్యూ కలెక్టర్



గట్టు : భారత్ మాల్ రోడ్డులో భాగంగా భూములు కోల్పోయిన రైతుల పట్టా పాస్ పుస్తకాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. మండలంలోని సల్కాపురం గంగమ్మదొడ్డి , రాయపురం, తప్పెట్లమరసు గ్రామాల రైతుల పట్టాపాస్‌పుస్తకాలను పరిశీలించారు. వీటిలో 87 మంది రైతులు భూమిని కోల్పోగా మంగళవారం 26 మంది రైతులు మాత్రమే హాజరై వారి పాస్ బుక్కులను అవార్డు పత్రాలను డిస్ట్రిక్ట్ అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సరిత రాణి , రవికుమార్ , రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో .. ఎరువులు, విత్తనాలు

- జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

వర్షాకాలం ప్రారంభమ వుతున్నందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె . గోవింద్ నాయక్ తెలిపారు. బుధవారం గద్వాలలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార కేంద్రాన్ని ఆయన సంద ర్శించారు. జిల్లాలో 650 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 381.9 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. 91.8 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా 268.1 క్వింటాళ్ల విత్త నాలు సరఫరా చేస్తున్నమని అన్నారు. అదేవిధంగా రైతులకు కావాల్సిన పచ్చి రొట్ట ఎరువులు అందుబాటులో ఉంచామని, రైతులెవ్వరు భయ పడాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. పత్తి రైతులు బీటీ -2 హైబ్రిడ్ విత్తనాలు ఒకే విధంగా పనిచేస్తాయి, ఒకే రకమైన కంపెనీ విత్తనాలు కాకుండా అందు బాటులో ఉన్న ఏ రకమైన కంపెనీ విత్తనాలైనా కొనుగోలు చేసుకో వచ్చని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయ వద్దని, ఆయాకంపెనీ లేబుల్ కలిగిన ప్యాకెట్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పని సరిగా తీసుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయా లన్నారు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

- ఆర్డీవో సీహెచ్ మధుమోహన్



నవ తెలంగాణ - నారాయణపేట

కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని నారాయణపేట ఆర్డీవో సీ.హెచ్. మధు మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు హాలులో నారాయణపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్.ఐ.లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జూన్ 4 న మహబూబ్ నగర్ లోని పీ యూ లో నారాయణపేట జిల్లాకు సంబంధించిన పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభ మవుతుందని, నారాయణపేట నియోజకవర్గానికి సంబంధించి రెవెన్యూ అధికారులు, ఉద్యోగులకు లెక్కింపు కేంద్రంలో అప్పగించిన పనిని ఎలాంటి పొరపాటు జరగకుండా పూర్తి చేయా లన్నారు. మొత్తం 14 టేబుళ్ళకు గాను ఏడు ఒకవైపు, మరో ఏడు ఇంకోవైపు ఏర్పాటు చేస్తారని, నియోజక వర్గానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాలను బట్టి 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. టేబుళ్ళ వారీ గా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులకు విధులు కేటాయించడం జరిగిందని, ఎవరికి కేటాయించిన స్థలం లోనే వారు ఉండి, అప్పగించిన బాధ్యతలను సమర్థవ ంతంగా నిర్వర్తించాలని కోరారు. జూన్ 4 న తెల్లవారు జామున 3 గంటలకు అధికారులు, ఉద్యోగులు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకోవాలని, ఇక్కడి నుంచి బస్సులో అందరూ మహబూబ్ నగర్ లోని పీ యూ కు బయలు దేరి ఉదయం 7 గంటల వరకు అందరూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కు సిద్ధం కావాల్సి ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కార్యాలయ ఏ ఓ, కార్యాలయ అధికారులు, సిబ్బంది, అన్ని మండలాల తహసిల్దారులు, ఆర్.ఐలు పాల్గొన్నారు.

చిన్నంపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆర్డీఓ



గట్టు : చిన్నోనిపల్లి రిజర్వాయర్ ముంపు గ్రామాన్ని ఆర్డీఓ రామచంద్రయ్య, ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్ , జెఈ ఉపేంద్ర , తహసీల్దార్ సరిత రాణి, ఇరిగేషన్ సంబంధించిన అధికారులు కాంట్రాక్టర్ సునీల్‌లు బుధవారం సందర్శించారు. గ్రామానికి చేరుకొని గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ పూర్తిచేసినప్పటికీ ఇండ్లు మునిగిపోయే ప్రమాదం ఉందని, అందుకుతగు చర్యలు తీసుకొని గ్రామం మునిగిపోకుండా ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా రిజర్వాయర్ నుంచి నీరు బయటికి వెళ్లే విధంగా కాలువ తవ్వి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని పేర్కొన్నారు .ఆ తర్వాత ఆర్ ఆర్ సెంటర్‌ను పరిశీలించి అందులో ఏ ఏ వసతులు సమస్యలు ప్రజలను అడిగి ఆర్‌ఆర్ సెంటర్ లోకి ప్రజలు వెళ్లకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు, భూములు సర్వం కోల్పోయిన రైతులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి రిజర్వాయర్ పనులు అలాగే పెండింగ్‌లో ఉండడంతో చాలా నష్టపోవడం జరిగిందని వాపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఒక్క వర్షం వచ్చే సరికి రిజర్వాయర్‌లోకి నీరు భారీగా చేరుకుంది. ఇలాగే కొనసాగితే గ్రామం నీట మునిగిపోతుందని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇల్లు భూమి సర్వం కోల్పోయిన వారికి ఒక్క 1.04000, కుటుంబంలో ఒకరికి రెండు లక్షల పైచిలుకు ప్యాకేజీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇల్లు, భూమి కోల్పోయిన వారికి తెలంగాణ రాష్ట్రంలో మల్లన్న సాగర్ ప్రాజెక్టు ముంపు బాధితులకు తొగుట మండలం రాంపూర్ ముంపు గ్రామంలో ఇచ్చిన విధంగా 12 లక్షల 54,000 అదే జీవో మాకు కూడా వర్తింపజేయాలని సంబంధిత అధికారులకు రైతులు వివరించారు. ఇంకా సిఫార్మ్ తీసుకొని 70 పట్టాలు ఏవైతే ఉన్నాయో వాటిని పరిశీలించి వారందరికీ మల్లన్న సాగర్ ముంపు బాధితులకు వర్తింపజేయాలని ఆర్డీఓని కోరారు. తమకు న్యాయం చేయవలసిందిగా కోరారు. అందుకు ఆర్డీవో సానుకూలంగా స్పందించి మీకు ప్రభుత్వపరమైన ఫెసిలిటీస్ ఏవైతే ఉన్నాయో వాటిని వర్తింపజేసే విధంగా ప్రయత్నం చేస్తామని, త్వరగా కాలువ తవ్వి రిజర్వాయర్ నుంచి నీటిని బయటికి వెళ్లే విధంగా కాంట్రాక్టర్ కు పనులు మొదలు పెట్టమని సూచించారు. కాంట్రాక్టర్ సరే అని ఒప్పుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్యాయం జరిగిందని రైతులు వాపో యారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన లో గ్రామానికి 100శాతం న్యాయం జరుగు తుం దని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోని ఆర్ఐ , ముంపు గ్రామ రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



నవ తెలంగాణ - మాగనూర్

మాగనూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5వేల విలువ చేసే క్రీడా దుస్తులను ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత పీఈటీ బీ . గోపాలం అందజేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు బీ. దీప తెలిపారు. ఈ సందర్భంగా బీ.గోపాలం మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యా యురాలు డీ .దీప విద్యార్థులకు క్రీడా దుస్తులను అడిగినందుకు విద్యార్థులను క్రీడల వైపు మళ్లించుటకు క్రీడా దుస్తులను 20 మందికి అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి నిర్బంధ వ్యాయామ విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లయితే, చిన్నతనంలోని విద్యార్థులు క్రీడలలో రాణిస్తారని, గ్రామీణ ప్రాంతాలలో క్రీడా ఆణిముత్యాలను వెలికి తీయవచ్చునని, హైదరాబాద్ హకీంపేట క్రీడా పాఠశాలకు విద్యార్థులకు ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ తరఫున పాఠశాలలు తెరిచిన తర్వాత ఉచితంగా కోచింగ్ ఇస్తామని బీ.గోపాలం తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉం టుందని సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారన్నారు. బీ. దీప విద్యార్థి దశలో జాతీయస్థాయిలో ఖో ఖో ఆడి వెండి పథకం సాధించిందని, క్రీడాకారిణిగా తమ పాఠశాల విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించుటకు సహకారం అందించాలని దీప కోరినట్లు తెలిపారు. గత సంవత్సరం పాఠశాల విద్యార్థిని క్రీడా పాఠశాలకు దీప పంపడం జరిగిందని, క్రీడాకారులకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు.పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేసిన బీ. గోపాలంకు ఉపాధ్యాయురాలు దీప కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన



మక్తల్ : బుధవారం నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు.. షీ టీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ శ్రీదేవీ ఆధ్వర్యంలో మక్తల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాలలో విద్యార్థులకు బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా హరాస్మెంట్, ఫోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్స్, గృహ హింస, షీ టీమ్స్, భరోసా సెంటర్, బాల్య వివాహాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీదేవీ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలపై చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరిక ట్టాలనే ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యుక్తవయసులో ఉన్న తమ పిల్లల దైనందిన కార్యకలాపాలను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని, బాల్యవివాహలను ప్రోత్స హించే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్ప వన్నారు. బాల్య వివాహాలు చేయరాదని , సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే 1930 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. నారాయణపేట జిల్లా పరిధిలో మహిళల, విద్యార్థుల రక్షణ మరియు భద్ర తకు షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని అన్నారు. ఆపద సమయంలో షీ టీమ్ నంబర్ 8712670398 కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మంచిగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు. పోలీసు శాఖ తరపునే కాకుండా ఇతర శాఖల ఆధ్వర్యంలో కూడా ఇకపై నిత్యం ఇలాంటి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఆపదలో ఉన్నవారు టోల్ ఫ్రీ నంబర్స్ 1930, 108, 100, 112 లకు ఫోన్ చేసి పోలీసు, తదితర శాఖల యంత్రాంగం సేవలు పొందాలని కోరారు. ప్రతి ఒక్కరూ కూడా మహి ళలపై, చిన్న పిల్లలపై జరు గుతున్న అఘా యిత్యాలను నిరోధించేందుకుకృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, షీ టీమ్ పోలీసులు శ్రీ దేవి,బాల్‌రాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ - మదనాపురం

మదనాపురం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకులు అనిమోని మాసన్న యాదవ్ తండ్రి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించారు. చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు .అనంతరం మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆసుపత్రి డాక్టర్లకు సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీడీవో ధనంజయగౌడ్



నవ తెలంగాణ - ఊట్కూర్

తమ బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ధనంజయగౌడ్ అన్నారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని బుధవారం మండల కేంద్రమైన ఊట్కూర్‌లో జరిగే మురికికాల్వల పనులను ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. శుభ్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ కవర్ వాడడంతో జరిగే నష్టాల ఎక్కువగా ఉన్నాయని, ప్లాస్టిక్ కవర్స్‌ను నిషేధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

తీరిన నీటి ఎద్దడి



మక్తల్ : మండలంలోని మంతన్‌గోడ్ గ్రామంలో నీటి సమస్య తీరింది. నీటి ఎద్దడిని తీర్చాలని గతంలో ఎన్నో సార్లు విన్నవించుకున్నా ఎవ్వరూ కూడా వారి దాహాన్ని తీర్చడానికి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు కె రాజేందర్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లడంతో తన సొంత నిధులతో గ్రామంలోని బృందావన్ కాలనీలో భూమి పూజ చేసి బోరు డ్రిల్లింగ్ చేసి బోరు వేయించారు. దీంతో గ్రామ ప్రజలు,పెద్దలు, నాయకులు ,కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డబ్బా సువ్వన్న, చందర్, కుర్వ సిద్దప్ప, రంజిత్, ఇబ్రహీం, సద్దాం, ఖలీల్, పింజారి మైబోలి, తెలుగు ఆంజనేయులు, కర్వ శివరాజు, మల నర్సిములు, కలాల్ నరేష్ , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

- వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్

నవ తెలంగాణ - నారాయణపేట

వానాకాలం 2024 సంవత్సరానికి గాను నారాయణపేట జిల్లాకు 1,700 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆగ్రో రైతు సేవాకేంద్రాలు, పీ.ఏ.సీ.ఎస్ ద్వారా 29-5- 2024 వరకు 999.60 క్వింటాళ్ల విత్తనాలు 60 శాతం సబ్సిడీపై 55,77,768 రూ. సబ్సిడీపై 1,619 మంది రైతులకు ఇప్పటి వరకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన 700.40 క్వింటాళ్ల విత్తనాలను వచ్చేవారం లోపల రైతులకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కొంతమేర పడినప్పటి ఇంక పూర్తి స్థాయిలో ఉష్ణోగ్రతలు తగ్గలేదని, ఇంకనూ నేల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, జీలుగ విత్తనాలు వేయడానికి నేల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండాలని పేర్కొన్నారు. రైతులు తొందర పడకుండా నేల ఉష్ణోగ్రత తగ్గిన తర్వాతనే విత్తుకోవాలని సూచిం చారు. 2024 వానాకాలం జిల్లాలో 1,85,000 ఎకరాలలో పత్తి పంట సాగు అవుతుందన్న అంచనాలలో 70,000 పత్తి విత్తన ప్యాకేట్లు అవసరం కాగా జిల్లాలో ఇప్పటి 3,62,516 ప్యాకెట్లు 245 విత్తన దుకాణాలలో రైతులకు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే రైతులు 1,19,197 పత్తి ప్యాకెట్లు కొనుగోలు చేశారని పేర్కొన్నారు.జిల్లాలో 2,43,319 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అన్ని పత్తి హైబ్రిడ్ రకాలకు నారాయణ పేట జిల్లా నేలలు అనుకూలమైన బీఈఏసీ సిఫారసు చేయబడి, 19-2-2 సాంకేతికతో రూపొందించబడ్డ విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. దాదాపు అన్ని రకాల పత్తి హైబ్రీడ్‌ల దిగుబడి ఇంచుమించుగా ఒకేలా ఉంటుందని తెలిపారు. తేలికపాటి నేలలో 50 ఏం.ఏం, బరువు నెలలో 70. ఏం.ఏం. వర్షపాతం నమోదైతే రైతులు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. లేనిచో విత్తనం సరిగ్గా మొలకెత్తక ఒరిగి పోతాయని, తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోవలసి వస్తుందన్నారు. విత్తనాల కొనుగోళ్ల విషయంలో రైతులు లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల నుంచి తగిన రశీదును పొంది విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. పంటవేసిన తర్వాత విత్తన సంచులను, బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా భద్రపర్చుకోవాలన్నారు. లూజ్ విత్తనాలు, ప్యాకింగ్ లేని విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయరాదని సూచించారు.